సంపుటి :02 సంచిక :204 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

బుధవారం 08, అక్టోబర్ 2025

## తొలి విడత ఆరు మండలాల్లో



స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

02



## ట్రాఫిక్ నియంత్రణకు కలిసి పనిచేద్దాం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

ట్రాఫిక్, మున్సిపల్ అధికారుల సమావేశం

03

# ఉత్కంఠ



## బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు విచారణ రేపటికి వాయిదా

02

బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పు నేడు రానుంది. అప్పటివరకు విచారణను వాయిదా వేసిన న్యాయస్థానం... ఎన్నికలపై స్టే ఇవ్వడానికి మాత్రం నిరాకరించింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ గురువారం (అక్టోబర్ 9) యధావిధిగా ప్రారంభం కానుంది. నోటిఫికేషన్ విడుదల కానుండటంతో అభ్యర్థులు నామినేషన్లకు సిద్ధమయ్యారు. అయితే, గురువారం మధ్యాహ్నం న్యాయస్థానం ఇచ్చే తీర్పుపైనే ఎన్నికల భవితవ్యం ఆధారపడి ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

- అక్షరదర్బార్, వరంగల్

- స్థానిక సంస్థల ఎన్నికలపై పిటిషనర్ కు లభించని స్టే
- రేపు యధావిధిగా ప్రారంభం కానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ
- ఉదయం 10.30 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్న ఆర్వోలు
- 11వ తేదీ వరకు కొనసాగనున్న తొలి విడత నామినేషన్ల స్వీకరణ
- పోటీ ఏర్పాట్లలో అభ్యర్థులు

## స్టే ఇచ్చేందుకు నిరాకరణ

బీసీ రిజర్వేషన్ల అంశంపై విచారణ రేపటికి వాయిదా

02

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9పై హైకోర్టులో ఉత్కంఠ కొనసాగుతోంది. రిజర్వేషన్లపై స్టే ఇవ్వడానికి న్యాయస్థానం నిరాకరించినప్పటికీ, జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేసింది. 50 శాతం మించిన రిజర్వేషన్లపై రాజ్యాంగపరమైన అంశాలను పిటిషనర్లు గట్టిగా వినిపించగా, శాసన వ్యవస్థ నిర్ణయాలను కోర్టులు ప్రశ్నించలేవని ప్రభుత్వం తరపు న్యాయవాది ఏఎం సింఘ్వీ వాదించారు. నేడు హైకోర్టు వెలువరించే తీర్పుపైనే ఎన్నికల ప్రక్రియ భవితవ్యం ఆధారపడి ఉంది. – అక్షర దర్బార్, హైదరాబాద్

### బాణసంచా విక్రయ కేంద్రాలకు

## దరఖాస్తు చేసుకోండి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

04

- అసలైన బీసీలకే టికెట్ ఇవ్వాలంటూ వాదనలు
- రెడ్డి గాండ్లను బీసీ నుండి తొలగించాలని డిమాండ్
- మతం మారిన బీసీలకు సైతం టికెట్లు ఇవ్వద్దంటూ మొదలైన ప్రచారం
- కలెక్టర్, ఎమ్మార్వోలకు వినతి పత్రాలు సమర్పణ
- హాట్ టాపిక్ అవుతున్న బీసీ వాదం



### కాటారం సబ్ డివిజన్‌లో

## బీసీ లొల్లి..!!

05

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు 'అసలైన బీసీ'ల వాదం తెరపైకి వచ్చింది. బీసీలు కానివారు రిజర్వేషన్లలో పోటీ చేస్తూ తమ అవకాశాలను దెబ్బతీస్తున్నారంటూ ఆయా వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ఓసీలుగా చలామణి అవుతున్న 'రెడ్డిగాండ్ల' కులాన్ని బీసీ జాబితా నుంచి తొలగించాలని బీసీ ఐక్య వేదిక నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అంతేకాకుండా, మత మార్పిడి చేసుకున్న (క్రైస్తవంలోకి మారిన) ఎస్సీ, బీసీల కుల ధ్రువపత్రాలను రద్దు చేసి, వారిని రిజర్వేషన్లలో పోటీ చేయకుండా అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ 'నకిలీ బీసీ'ల లొల్లి ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. – అక్షర దర్బార్, కాటారం

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలి

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నేపథ్యంలో అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీమతి రాణి కుమిదిని ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ తదితర అంశాలపై సమీక్షించారు. భూపాలపల్లి జిల్లా ఐడిఓసి కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, శ్రీమతి విజయలక్ష్మి , ఏఎస్పి నవీన్ కుమార్, డిపిఓ శ్రీమతి శ్రీలత, డిపిఆర్వో శ్రీనివాస్, సీపీఓ బాబురావు తదితర అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో 6 జడ్పిటిసి మరియు 58 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఎంపీడీవో కార్యాలయంలోనే జడ్పిటిసి, ఎంపిటిసి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎంపిటిసి ఎన్నికల కోసం 19 రిటర్నింగ్ అధికారులను, జడ్పిటిసి ఎన్నికల కోసం 6 రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆర్ఓ, ఏఆర్ఓలకు శిక్షణా పూర్తి చేసినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ స్పష్టం చేశారు.


www.aksharadarbar.com అక్షర దర్బార్ Voice of the people




# ఉత్కంఠ..!

- స్థానిక సంస్థల ఎన్నికలపై పిటిషనర్ కు లభించని స్టే
- రేపు యధావిధిగా ప్రారంభం కానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియ
- ఉదయం 10.30 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్న ఆర్వోలు
- 11వ తేదీ వరకు కొనసాగనున్న తొలి విడత నామినేషన్ల స్వీకరణ
- పోటీ ఏర్పాట్లలో అభ్యర్థులు

**బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు విచారణ రేపటికి వాయిదా**

**అక్షరదర్బార్, వరంగల్ :**

బీసీ రిజర్వేషన్ల అంశంపై విచారణను హైకోర్టు గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేయడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతుంది. పిటిషనర్ కోరినట్లు స్టే ఇవ్వకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై యధావిధిగా ముందుకు వెళ్లాలని ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జడ్పీటీసీ, ఎంపీటీసీ తొలి విడత ఎన్నికల నిర్వహణకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. షెడ్యూల్ ప్రకారం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు ఈ నెల 9న మొదటి విడత, 13న రెండో విడత నోటిఫికేషన్ జారీ కానున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రిటర్నింగ్ అధికారులు గురువారం ఉదయం 10:30 గంటలకు రాష్ట్రంలో 292 జడ్పీటీసీ, 2963 ఎంపీటీసీ స్థానాలకు తొలి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. నోటిఫికేషన్ విడుదలైన రోజునుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ తొలి విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఈనెల 11 వరకు కొనసాగనుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తొలి విడత పోలింగ్ ఈనెల 23న, రెండో విడత పోలింగ్ 27న జరగనుంది. నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఎంపీడీవో కార్యాలయాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ నిర్వహణకు ఓట్ల లెక్కింపునకు కూడా ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు.

### - నామినేషన్ల దాఖలకు రెడీ

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. దీంతో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేయాలని ఉబలాటపడుతున్న ఆశావహులు తెరపైకి వచ్చారు. ముఖ్యంగా ప్రధాన రాజకీయ పార్టీల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ ఉంది. కాంగ్రెస్ పార్టీ ఆయా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానం నుంచి ముగ్గురు పేర్లతో జాబితాలను రూపొందించింది. జడ్పీటీసీ అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న వారి పేర్ల జాబితా టీపీసీసీకి చేరింది. ఇక ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థులను డీసీసీ స్థాయిలోనే ఖరారు చేసేందుకు కసరత్తు జరుగుతుంది. అభ్యర్థుల ఖరారుపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో వడబోత కార్యక్రమం జరుగుతుంది. ఎంపీటీసీ అభ్యర్థిత్వాలపై ఒక నిర్ణయానికి వచ్చినప్పటికీ జడ్పిటిసి అభ్యర్థుల ఖరారుపై బీఆర్ఎస్ ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఇక ఇండిపెండెంట్ గా కూడా పోటీ చేయాలని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల నుంచి పలువురు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. గురువారం నోటిఫికేషన్ జారీ కానుండటంతో నామినేషన్ దాఖలు చేసేందుకు రెడీ అవుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి కూడా కొందరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి సిద్ధమయ్యారు. అయితే గురువారం మధ్యాహ్నం బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు వెలువరించే తీర్పుపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# తొలి విడత ఆరు మండలాల్లో..

### - స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

అక్షరదర్బార్, భూపాలపల్లి: జిల్లాలో మొదటి విడత జరుగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ, నామినేషన్లు స్వీకరణ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 6 జడ్పీటీసీ, 58 ఎంపీటీసీ స్థానాలకు మొదటి విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 9న నోటిఫికేషన్ జారీ కానున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో గనపూర్, చిట్యాల, రేగొండ, కొత్తపల్లి గోరి, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు జరుగనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి జడ్పీటీసీలకు 6, ఎంపీటీసీలకు 19 మంది రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఎలాంటి విరుద్ధ చర్యలు చోటు చేసుకోకుండా కఠినంగా పర్యవేక్షించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లతో శాంతి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసులు అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , ట్రైని డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఏఎస్పీ నవీన్ కుమార్, రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# స్టే ఇచ్చేందుకు నిరాకరణ

- బీసీ రిజర్వేషన్ల అంశంపై విచారణ రేపటికి వాయిదా

**అక్షరదర్బార్, హైదరాబాద్ :**

బీసీ రిజర్వేషన్ల అంశంపై సస్పెన్స్ కొనసాగుతోంది. జీవో నెంబర్ 9ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. రేపు మధ్యాహ్నం 2.15 గంటలకు విచారణ జరపనుంది. తొలిరోజు జరిగిన వాదనల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తోందని పిటిషనర్లు వాదించారు. రాజకీయాలకు అతీతంగా బీసీ రిజర్వేషన్లకు మద్దతు లభించిందని గుర్తుచేసిన ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ శాసన వ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరని వాదించారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందన్న సింఘ్వీ ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవద్దని తీర్పులున్నాయని వాదించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9ను సవాల్ చేస్తూ మాధవరెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేయగా బీసీల రిజర్వేషన్లకు అనుకూలంగా, వ్యతిరేకంగా పలు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. బీసీ సంఘం నేతలు ఆర్ కృష్ణయ్య, వీహెచ్‌తో పాటు పలువురు బీసీ నేతలు ఈ ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాదులతో పాటు ప్రభుత్వం తరపు న్యాయవాదులూ బలమైన వాదనలు వినిపించారు.

### - పిటిషనర్ల వాదనలు

మొదట వాదనలు వినిపించిన పిటిషనర్ల తరపు న్యాయవాదులు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తోందని వాదించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని రాజ్యాంగం చెబుతుందన్న పిటిషన్ల తరపు న్యాయవాదులు తెలంగాణ ప్రభుత్వం బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లతో మొత్తం కోటా 67 శాతానికి చేరిందని వాదించారు. బీసీల కులగణనకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ నివేదిక సైతం పారదర్శకంగా లేదని పేర్కొన్నారు. మహారాష్ట్రలో రిజర్వేషన్లు 50శాతం దాటితే సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. రిజర్వేషన్లు పెంచుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నా 50 శాతం మించరాదని గుర్తు చేశారు.
బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు అంటున్న ప్రభుత్వం బీసీ డెడికేషన్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేయలేదని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదన్నారు. 2011 జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు వర్తింపజేసిన సర్కారు ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందా? తగ్గిందా? అనే లెక్కల్ని పరిగణలోకి తీసుకోకుండా బీసీ రిజర్వేషన్లను ఎలా ఖరారు చేస్తారంటూ వాదించారు. 2018లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను ఇదే కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికల నిర్వహణకు తాము వ్యతిరేకం కాదన్న పిటిషనర్ల న్యాయవాది రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. జీవో నెంబర్ 9 ద్వారా పంచాయతీరాజ్ చట్టసవరణ జరిగినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొనటం లోపభూయిష్టమన్న పిటిషనర్ల న్యాయవాది జీవో 9లో పంచాయతీరాజ్ చట్టం ప్రస్తావనేలేదని పేర్కొన్నారు.

### - స్టే ఇవ్వాలని కోరడం సరికాదు

రాష్ట్ర ప్రభుత్వ తరుపున వాదనలు వినిపించిన న్యాయవాది ఏఎం సింఘ్వీ రాజకీయాలకు అతీతంగా బీసీ రిజర్వేషన్లకు మద్దతు లభించిందని గుర్తు చేశారు. శాసన వ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరని ఏ సవరణ చేసినా, చట్టం చేసినా శాసన వ్యవస్థదే నిర్ణయమని వాదించారు. ప్రజల సంక్షేమ కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్న సింఘ్వీ, బీసీ డెడికేషన్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతం కంటే ఎక్కువ పెంచొచ్చని కోర్టు దృష్టికి తెచ్చారు. జీవో నెంబర్ 9పై స్టే ఇవ్వాలని కోరడం సరికాదన్న సింఘ్వీ సమగ్ర గణన ద్వారా కులాల లెక్కలు లభించాకే ప్రభుత్వం రిజర్వేషన్లపై ముందుకొచ్చిందని వాదించారు. సామాజిక ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వే ఆధారంగా బీసీ డెడికేషన్ కమిషన్ అందించిన నివేదిక ఆధారంగానే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని కోర్టు దృష్టికి తెచ్చారు.

# గుర్రం వెంకటేశ్వర్లుకు నివాళి

అక్షర దర్బార్ (నూగూరు)/ వెంకటాపురం : కామ్రేడ్ గుర్రం వెంకటేశ్వరరావు 15వ వర్ధంతి సభ బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ మాట్లాడుతూ, పార్టీ పోరాటాలను బలోపేతం చేయడమే గుర్రం వెంకటేశ్వర్లుకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. గుర్రం వెంకటేశ్వరరావు ఒంగోలు నుంచి వెంకటాపురం వచ్చి పార్టీ పోరాటాలకు చురుగ్గా పాల్గొన్న నాయకుడు అని గుర్తుచేశారు. వ్యాపారాలను పక్కన పెట్టి పూర్తి కాలం పార్టీ కార్యకర్తగా సేవ చేసిన ఆయనకు ఎర్రజెండా ఊపిరిగా ఉంటుందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎర్రజెండా ఎగరవేయడమే ముఖ్య లక్ష్యం అని సాంబశివ పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతృత్వం




లోని గ్యానం వాసు, జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి శ్రీను, కట్ల చారి, మండల కమిటీ సభ్యులు దేవమని, నరసింహారావు, పరిశీక రాంబాబు, తోట నాగేశ్వరరావు, గుర్రం పుల్లారావు, పార్టీ కార్యక ర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాలలు అర్పిస్తూ నివాళి ఘటించబడింది.

# హాస్టల్ బియ్యం అక్రమ విక్రయంపై మంత్రి పొన్నంకు ఫిర్యాదు



అక్షర దర్బార్, పరకాల: పరకాల బీసీ కళాశాల బాలుర వసతిగృహానికి చెందిన 12 క్వింటాళ్ల సన్న బియ్యాన్ని అక్రమంగా ప్రైవేటు వ్యక్తికి అమ్మిన ఘటనపై హాస్టల్ వార్డెన్ అందె రవిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఫిర్యాదు చేశారు. హాస్టల్ వార్డెన్ అక్రమంగా విక్రయిం చడంపై తహసీల్దార్, పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి తక్షణమే విచారణకు ఆదేశాలు జారీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



# ట్రాఫిక్ నియంత్రణకు కలిసి పనిచేద్దాం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- ట్రాఫిక్, మున్సిపల్ అధికారుల సమావేశం



అక్షరదర్బార్, హనుమకొండ: ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ ట్రై సిటీ పరిధిలో రోజు రోజుకి వాహనాల సంఖ్య పెరిగి పోతుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి ఆధ్వర్యంలో ట్రాఫిక్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో నగరంలో పార్కింగ్ స్థలాల ఏర్పాటు, రోడ్ల ఆక్రమణలు, ప్రధాన రోడ్ల మార్గంలో వాహనదారులకు ప్రమాదకంగా మారిన గుంతల మరమ్మత్తులు, వడ్డేపల్లి, కాళోజి సెంటర్, తెలంగాణ జంక్షన్, మడికొండ చౌరస్తా, మరో రెండు ప్రాంతాల్లో నూతనంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, ప్రధానంగా రోడ్లపై వ్యాపార సైన్ బోర్డుల తొలగిం పుతో పాటు వ్యాపార సముదాయాల్లోని సెల్లార్లలో వాహనాలు మాత్రమే పార్కింగ్ చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ప్రధాన రోడ్డు మార్గంలోని డివైడర్ల ఎత్తును పెంచాలని, అలాగే రోడ్లపై వినియోగంలో లేని కరెంటు, టెలిఫోన్ స్తంభాల తొలగించడం, వర్షా కాలంలో వరద నీరు రోడ్లపై నిలిచి వాహన రాక పోకలకు ఇబ్బందులు కలిగే ప్రాంతాల్లో వరద నీరు సాఫీగా పోయేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుక వచ్చారు.

ట్రాఫిక్ అధికారుల సూచనలపై మున్సిపల్ కమిష నర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీస్, మున్సిపల్ అధికారులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు గుంతలు పడిన ప్రాంతాలతో పాటు డివైడర్ల ఎత్తు పెంపు ప్రాంతాలకు సంబంధించి పూర్తి వివరాలు ట్రాఫిక్ అధికారులు అందజేయాలన్నారు. ముఖ్యంగా ట్రై సిటీలో పోలీస్, మున్సిపల్ అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి పార్కింగ్ కు అనువైన ప్రాంతాలను గుర్తించాలని, రోడ్లపై ఆక్రమణ తొలగింపునకు మున్సిపల్ కమిష నర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి పోలీస్, మున్సిపల్ శాఖల సంయుక్త సమన్వయం అత్యంత అవసరమని అన్నారు. ఇరు శాఖలు కలిసి పనిచేస్తేనే నగర ట్రాఫిక్ సాఫీగా సాగి రోడ్డు ప్రమాదాలను తగ్గించగల మని సీపీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్ స్పెక్టర్లు సీతారెడ్డి, వెంకన్న, సుజాత, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని బీజేపీ కుట్ర

: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి



అక్షర దర్బార్, శాయంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడి ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు కాట్రపల్లి, నూర్జాన్ పల్లి, సాధ నపల్లి, రాజుపల్లి గ్రామాల్లో బుధవారం "బీజేపీ ఓటు చోరీ ఆపండి" సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నేతృ త్వంలోని కాంగ్రెస్ పార్టీ బీజేపీ అక్రమాలను బహిర్గతం చేస్తోందని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిం చాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాసని చంద్ర ప్రకాష్, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, చక్రపాణి, మారపెల్లి రవీందర్, వైనాల కుమారస్వామి, చిందం రవి, అబ్బు ప్రకాశ్ రెడ్డి , బోనపెల్లి రఘుపతి రెడ్డి, కొమ్ముల భాస్కర్, కొమ్ముల సదానందం, జగన్, సతీష్, తిరుపతిరావు, రామచంద్రు తదిత రులు పాల్గొన్నారు.

# డాక్టర్ గూటం రామ్ ప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు

అక్షర దర్బార్, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సురక్ష మల్టీ స్పెషాలిటీ



హాస్పిటల్ మేనేజ్మెంట్ డాక్టర్ గూటం రామ్ ప్రసాద్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. జిల్లా నాయకులు కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించారు. ఎమ్మా ర్పీఎస్ టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్ మాదిగ డాక్టర్ రాంప్రసాద్ సేవా మనసును అభినందిం చారు. కార్యక్రమంలో శీలపాక హరీష్ మాదిగ, రాకేష్ ముల్కల సురేష్, వాసాల కుమార్ పాల్గొన్నారు.

# కొప్పులలో కాంగ్రెస్ బాకీ కార్డు ప్రచారం



అక్షర దర్బార్, శాయంపేట: మండలంలోని కొప్పుల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో "కాంగ్రెస్ బాకీ కార్డు" ప్రచారం నిర్వహించారు. రైతుబంధు, రుణమాఫీ, మహిళలకు రూ.2500, పెన్షన్ పెంపు, కళ్యాణలక్ష్మీ వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శిం చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ నాయకులను తమ బాకీ కార్డు చూపించి జవాబు అడగాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మేకల వెంకన్న, మాజీ ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, అట్ల రమేష్, అట్ల తిరుపతి, మామిడి శంకర్, మాజీ సర్పంచ్ తోట కుమారస్వామి, పసునూటి రాజయ్య, సామల విజయ్, చాడ రాజిరెడ్డి, కొమురాజు ప్రశాంత్, దీండిగాల నాగార్జున్ , కరు రవి, ఆకుల శంకర్, గ్రామ యూత్ అధ్యక్షుడు పోతుల విష్ణు, మాస్ అనిల్, బండారి ఆనందం, ఆకుతోట రాజు, పసునూటి రాజు, గరిగ రమేష్ పాల్గొన్నారు.



# కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలి

: అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

అక్షర దర్బార్, భూపాలపల్లి: జిల్లాలో పత్తి పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. 2025–26లో 98,260 ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, సుమారు 11.79 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. మద్దతు ధర రూ. 8,110గా నిర్ణయించబడిందని, మార్కెట్లో తక్కువ రేటు పలికితే వెంటనే సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు 'కపాస్ కిసాన్ యాప్' ద్వారా తప్పనిసరిగా స్లాట్ బుకింగ్ చేసుకో వాలని, బుకింగ్ లేకుండా పత్తి స్వీకరించబోమని స్పష్టం చేశారు. జిన్నింగ్ మిల్లుల్లో నీరు, విద్యుత్, తేమ యంత్రాలు వంటి వసతులు అందుబాటులో ఉంచాలని, రైతులు మద్దతు ధర కంటే తక్కువకు పత్తి అమ్మవద్దని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్సూర్, జిల్లా అగ్నిప్రక అధికారి వి సతీష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా తూనికలు కొలతల అధికారి శ్రీలత, రవాణా శాఖ అధికారి సంధాని, సీసీఐ అధికారులు, జిన్నిం గ్ మిల్లు యజమానులు, మార్కెట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నల్లబెల్లిలో పందుల స్వైర విహారం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- జనావాసాల నుంచి తరలించాలని వేడుకోలు



అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండల కేంద్రంలో స్వేచ్ఛగా తిరుగుతున్న పందుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇళ్ల ఆవరణలు, పంటచేలల్లో పందులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. డెంగ్యూ వంటి రోగాల సీజన్లో వాతావరణం కలుషితం అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్ప టికైనా పందులను అదుపు చేసి ప్రజలకు ఉపశమనం కలిగించా లని నల్లబెల్లి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బాణసంచా విక్రయ కేంద్రాలకు దరఖాస్తు చేసుకోండి

## - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ: తాత్కాలిక బాణసంచా విక్రయాలతో పాటు బాణసంచా నిల్వ చేసుకొనేందుకు అనుమతి కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తు ఫారంతో తప్పనిసరిగా అగ్నిమాపక విభాగం అధికారులు జారీ చేసిన ఎన్ఓసీతో పాటు, ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేస్తున్నట్లయితే స్థల యజమాని అనుమతి పత్రం, ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతి పత్రం, పక్కా నిర్మాణాల్లో ఏర్పాటు చేస్తున్నట్లయితే పక్కవారి అనుమతితో పాటు పక్క భవన బ్లూ ప్రింట్, స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా, ఆదాలట్ శాఖలో రూ.800లు ప్రభుత్వ ఖజానాకు జమచేసినట్లు బ్యాంక్ చలాన్ తో దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను అక్టోబర్ 16వ తేదీలోపు సంబంధిత జోన్లకు చెందిన డీసీపీ స్థాయి అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సీపీ పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులు బాణసంచా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.



# పరకాలలో అయ్యప్ప కమిటీ సమావేశం..

అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా పరకాలలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరకాల అయ్యప్ప ఆలయంలో మండల కమిటీతో సమావేశం నిర్వహించారు. శబరిమల యాత్రలో నారాయణతోడు వద్ద జరిగే అన్నదాన కార్యక్రమం, ప్రతినెల జరిగే ఉత్తర నక్షత్ర అన్నదాన సేవలపై చర్చించి, రాబోయే శబరిమల మండల కాలానికి అవసరమైన రైస్, ఆయిల్, పప్పు దినుసులను దాతల నుంచి సమకూర్చే ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భయాన సంతోష్ కుమార్, సెక్రటరీ పెరుమాండ్ల శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి ఇనుగాల సుదర్శన్, పరకాల మండల అధ్యక్షుడు దర్శనాదుల రాజు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం

## ఎస్సై జక్కుల పరమేశ్వర్

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం మహిళా సమాఖ్య భవనంలో వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి విడ్స్ కౌన్సిలర్ మారపెల్లి క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ హాజరై మాట్లాడుతూ.. సైబర్ నేరాలు ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయో తెలియకుండానే ఆర్థిక నష్టం కలిగిస్తాయని తెలిపారు. బహుమతులు, మోసాలు, కుటుంబ సభ్యులను టార్గెట్ చేసే నేరాల ద్వారా సైబర్ క్రిమినల్స్ నేరాలకు పాల్పడుతున్నారని, ప్రతి ఒక్కరు పిల్లల స్మార్ట్ ఫోన్ వాడకాన్ని పర్యవేక్షించి, ఆర్థిక అప్లికేషన్ల ద్వారా వచ్చే నష్టాలపై జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

# గంగారం తండాలో కార్డన్ సెర్చ్

- 600 లీటర్ల జాగరి వాష్, 60 లీటర్ల గుడుంబా స్వాధీనం
- 17 ద్విచక్రవాహనాలు సీజ్



అక్షర దర్బార్,కాటారం: కాటారం మండలం గంగారం గ్రామంలోని లంబడి తండాలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సోదాల్లో పోలీసులు పెద్దఎత్తున అక్రమ మద్యం తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల తెలిపిన సమాచారం ప్రకారం.. ఈ దాడుల్లో 600 లీటర్ల జాగరి వాష్, 60 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. అదేవిధంగా 17 మోటార్సైకిళ్లను సీజ్ చేశారు. వాటిలో 5 బైకులు నంబర్ ప్లేట్లు లేకుండా, 12 బైకులు సరైన పత్రాలు లేకుండా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఈ సందర్భంగా డిఎస్పి సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో అక్రమ మద్యం తయారీ, రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొనరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జున రావు కాటారం ఎస్సై శ్రీనివాస్, సెకండ్ ఎస్సై రాజశేఖర్, థర్డ్ ఎస్సై మానస పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



అక్షర దర్బార్, నర్సంపేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమం ద్వారా రైతుల భూ సంబంధిత సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం ఆమె అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి నర్సంపేట ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించి, ఆరు మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఎన్ని పెండింగ్లో ఉన్నాయో, నోటీసులు ఇచ్చిన సంఖ్య, క్షేత్రస్థాయి పరిశీలన స్థితి వంటి వివరాలు తెలుసుకున్నారు. నిర్ణీత గడువులో అన్ని దరఖాస్తులను పరిష్కరించాలనీ, తిరస్కరించిన వాటికి కారణాలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. సాధా బైనామాలు, పీఓటీ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే నోటీసులు జారీ చేసి, క్షేత్రస్థాయి వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా రోజువారీగా పర్యవేక్షించి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో ఆర్డీవో ఉమారాణి, తహసిల్దార్లు రవిచంద్ర రెడ్డి, రాజేశ్వరరావు, రాజ్కుమార్, అబీద్ అలీ, రమేష్, కృష్ణా తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బద్ది పోచమ్మతల్లి బోనాలు



అక్షర దర్బార్ నర్సంపేట : నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి గ్రామంలో గల జోగిని మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బద్ది పోచమ్మ బోనాల పండుగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జోగిని మామిడి శ్రీనివాస్ గ్రామంలో నిర్మించిన బద్ది పోచమ్మతల్లి దేవాలయం వద్ద గత కొన్ని సంవత్సరాలుగా బోనాల పండుగ జాతర జరుగుతున్నది. ఈనేపద్యంలో జోగిని మామిడి శ్రీనివాస్ తో పాటు ఇతర మండలాల నుండి వచ్చిన పలువురు జోగినీలు బద్ధి పోచమ్మతల్లి బోనాలను వారి వారి తలలపై మోపుతూ గ్రామంలోని పలు గ్రామ దేవతల వద్దకు పలు విధాల విన్యాసాలు చేస్తూ డప్పుచప్పులతో ఊరేగింపు చేశారు. జోగిని శ్రీనివాస్ చేసిన ప్రత్యేక విన్యాసాలు గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి. బద్దిపోషమ్మతల్లి దేవాలయంలో అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం జోగిని శ్రీనివాస్ గ్రామ ప్రజలకు భవిష్యవాణిని వివరించారు.కాగా గ్రామస్తులు బోనాల సమర్పించి ధూప దీప నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పాలి



అక్షర దర్బార్ నల్లబెల్లి : మాదిగ జాతి బిడ్డ, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షుడు పరికి రత్నం మాదిగ డిమాండ్ చేశారు. మాదిగ సామజిక వర్గాన్ని అవహేళన చేసే విధంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తక్షణమే పొన్నం ప్రభాకర్ తన మాటలను వెనక్కి తీసుకుని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ నాయకులు పరికి కోర్నెల్ మాదిగ, బొట్ల మొగిలి మాదిగ, మామిండ్ల పెద్ద ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

## మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు

అక్షర దర్బార్, దుగ్గొండి: రానున్న ప్రాదేశిక ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రాదేశిక రెండో విడత ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఎన్నికల నియమావళి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్పై చర్చించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి లెక్కల అరుంధతి, పంచాయతీ అధికారి శ్రీధర్ గౌడ్, ఎస్సై రణధీర్ రెడ్డి, మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఏఈ ఎంబీ ఇంట్రా, మంగ్య నాయక్, పంచాయతీ కార్యదర్శులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



# పత్తిపాకలో కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ

అక్షర దర్బార్ శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామ బీఆర్ఎస్ నాయకులు బుధవారం 'బాకీ కార్డులను' ప్రజలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల పాలనలో తెలంగాణ ప్రజలకు 6'గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ఓటు అడగడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను గట్టిగా నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, నారాయణరెడ్డి, సమ్మిరెడ్డి, ఆదిరెడ్డి, తిరుపతి రెడ్డి, సాంబ రెడ్డి, తుడుం వెంకటేష్, పసుల ప్రవీణ్, సుభాష్, గజ్జి రమేష్ పాల్గొన్నారు.



# సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి**

అక్షర దర్బార్, శాయంపేట : స్థానిక పోరులో ప్రజా సమస్యల పరిష్కార కోసం నిరంతరం పోరాడే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు.బుధవారం శాయంపేట మండల కేంద్రంలో సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బత్తిని సదానందం అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ రాబోతున్న ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికలకు మండలంలోని కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ తో సయోధ్య కుదుర్చుకొని ముందుకు పోయామన్నారు. ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీతో సయోధ్య కోసం చర్చలు జరుగుతున్నాయన్నారు. లోకల్ ఎన్నికలకు కార్యకర్తలు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమం,మండలంలో నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం భూ పోరాటాలు, అదేవిధంగా ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను ఆశీర్వదించాలని, నిత్యం ప్రజల కోసం ఉద్యమించే సీపీఐ అభ్యర్థుల కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఐ మండల నాయకులు గుండ్రాతి రమేష్, బోగి రమేష్, బండారి సాంబయ్య, బోగి కన్నయ్య, ఎండీ గౌసియా, పుట్ట కళ, బోగి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.







## కాటారం సబ్ డివిజన్ లో

# బీసీ లొల్లి..

- అసలైన బీసీలకే టికెట్ ఇవ్వాలంటూ వాదనలు
- రెడ్డి గాండ్లను బీసీ నుండీ తొలగించాలని డిమాండ్
- మతం మారిన బీసీలకు సైతం టికెట్లు ఇవ్వద్దంటూ మొదలైన ప్రచారం
- కలెక్టర్, ఎమ్మార్వోలకు వినతీ పత్రాలు సమర్పణలు
- హాట్ టాపిక్ అవుతున్న బీసీ వాదం

అక్షర దర్బార్, కాటారం :తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ రిజర్వేషన్ బిల్లు కొన్ని ప్రాంతాల్లో తలనొప్పిని తెస్తోంది. బీసీ పాపులేషన్ అసలే లేని గ్రామాల్లో రిజర్వేషన్ ను కేటాయించడం ఓ వైపు,బీసీలు కానివారు బీసీ రిజర్వేషన్ లో పోటీ చేయిద్దని మరోవైపు నిగురు గప్పిన నిప్పులా పెద్ద ఎత్తు ఉద్యమానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ మండలాల్లో బీసీ రిజర్వేషన్ లొల్లి తారస్థాయికి చేరుతోంది. క్రమక్రమంగా అన్ని పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు పార్టీలకు అతీతంగా ముందుకు వచ్చి తమ తమ అసలైన బీసీ నినాదాన్ని బలంగా వినిపిస్తున్నారు.బీసీ లు కానివారు బీసీ రిజర్వేషన్లలో పోటీ చేస్తే ఊరుకునేది లేదంటూ ఊరు,వాడ అంతా సంఘటితమవుతున్నారు.అందుకు ప్రధాన కారణం కాటారం, మహాదేవపూర్, మల్హర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో ఓ వర్గానికి చెందిన ప్రజలు పేరుకు ఓసీలుగా చలామణి అవుతూ బీసీ రిజర్వేషన్ల ఫలాలు పొంది అసలైన బీసీలకు అన్యాయం చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. అంతే కాకుండా ఎవరైతే భారత రాజ్యాంగం ప్రకారం బీసీలుగా చలామణి అవుతున్నారో వారు ఇతర మతాల్లోకి మారినట్లయితే గతంలో ఉన్న బీసీ కేటగిరీ ప్రయోజనాలకి అర్హులు కారని ఎస్సీబీసీ కమిషన్, సుప్రీం కోర్ట్ తీర్పులు స్పష్టంగా పేర్కొన్నాయి. దీనిపై పెద్ద ఎత్తున సామాన్య ప్రజానీకం మద్దతూ తెలుపుతూ మతమార్పిడీ వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయొద్దంటూ బలమైన వాదనలు వినిపిస్తుండడం గమనార్హం. నకిలీ బీసీల ప్రభావం వల్ల అసలైన బీసీ వర్గాలకు ఉద్యోగ, రాజకీయ అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడునుందని సంబంధిత బీసీ ప్రజలంత ఏకమై తమ వాదాన్ని బలంగా వినిపించేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం ఈ అంశం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతున్నది.



## రెడ్డిగాండ్ల కులాన్ని బీసీ నుండి తొలగించాలి

**కలెక్టర్ కు బీసీ కులాల ఫిర్యాదు**

రెడ్డిగాండ్ల కులాన్ని బీసీ వర్గం నుండీ తొలగించాలని మహదేవపూర్ మండలానికి చెందిన బీసీ కులాల నాయకులు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతి పత్రాన్ని అందించారు. ప్రస్తుతం జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఆర్థికంగా,సామాజికంగా అభివృద్ధి చెందిన రెడ్డి కుల సామాజిక వర్గానికి చెందిన రెడ్డి గాండ్ల కులస్తులు బీసీ గుర్తించరాదని వినతి పత్రంలో కోరారు. అంతే కాకుండా బీసీలు కానివారు కాంగ్రెస్ పార్టీ తరుపున టికెట్ ఇవ్వొద్దంటూ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ కు వినతి పత్రాన్ని సైతం అందించారు.కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు సముద్రాల తిరుపతి, బీసీ నాయకులు గడ్డం స్వామి, తడకల జగదీష్, తన్నీరు రాఘవేంద్ర, అడప మల్లయ్య, దాగం సంతోష్, రెబ్బ ప్రతీప్ లు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శ

అక్షర దర్బార్,కాటారం: కాటారం మండలంలో పలు కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించారు. పలు అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించిన దామరకుంట గ్రామానికి చెందిన జిల్లెల పెద్ద రాజలింగన్న, విలాసాగర్ గ్రామానికి చెందిన రొడ్డబోయిన లక్ష్మి, దేవరాంపల్లి గ్రామానికి రెబ్బ రాజ మల్లక్క కుటుంబాలను పుట్ట మధుకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబాలకు ధైర్యం చెప్పి, పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జోడు శ్రీనివాస్, రామిళ్ళ కిరణ్, కుడుదుల రాజబాపు, వుర వెంకటేశ్వరరావు, కొండ గొర్ల వెంకటస్వామి, బాసాని రవి, జక్కు శ్రావణ్, మానెం రాజబాబు, చిట్యాల సమ్మయ్య, జిల్లెల శంకర్, కందికొండ రాజయ్య, ఇప్ప నాగరాజు, మునిమంద మదు, రామ్‌శెట్టి రాజు, దుర్గం రాజేష్, దుర్గం సతీష్, ఆకుదారి రాకేష్, ఎం.డి. మున్న, తోటి మనోహర్, జిముడ వంశీ, కుసుమ బానయ్య, అన్నవేన రవీందర్, బుర్రకుంట రాజయ్య, అన్నవే ప్రదీప్, శనిగరం లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరాలి

**బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవ రెడ్డి**

అక్షర దర్బార్ మల్హర్ : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తాను చాటాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి బిఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు బుధవారం బిఆర్ఎస్ పార్టీ తాడిచెర్లలో గడపగడపకు "కాంగ్రెస్ బాకీ కార్డు"పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. "కాంగ్రెస్ బాకీ కార్డు"తో ఇంటింటికీ ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గొనె శ్రీనివాసరావు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ చెప్యాల రామారావు,బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్ తోపాటు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# మతం మారిన ఎస్సీ, బీసీల కుల ధృవపత్రాలు రద్దు చేయాలి

**తహసీల్దార్ కు నేతకాని సంగం రాష్ట్ర నేత దుర్గం శ్రీనివాస్ వినతి**

భారత రాజ్యాంగం,ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రైస్తవ మతంలోకి మారిన షెడ్యూల్ కులాలు ఎస్సీ,బీసీ వ్యక్తులు కుల ధృవపత్రాలను ఉపయోగించి రిజర్వ్ సీట్లలో పోటీ చేయకుండా వారి కుల ధృవపత్రాలను వెంటనే రద్దు చేయాలని నేతకాని రాష్ట్ర యువజన నాయకుడు దుర్గం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో కు వినతిపత్రాన్ని అందించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 342 ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను ఆచరించే వారికే ఎస్సీ హక్కులు వర్తిస్తాయన్నారు. క్రైస్తవ మతంలోకి మారిన వారిని షెడ్యూల్డ్ కులాలుగా పరిగణించరాదని భారత రాజ్యాంగం ఆర్డర్, 1950 స్పష్టంగా పేర్కొన్నదని వినతి పత్రంలో వివరించారు.అలాగే వెనుకబడిన వర్గాల బీసీ రిజర్వేషన్ ప్రయోజనాలు "సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు" అనే నిర్వచనంపై ఆధారపడి ఉంటాయని, క్రైస్తవ లేదా ముస్లిం మతంలోకి మారిన వ్యక్తులు బీసీ కేటగిరీకి చెందరని జాతీయ వెనుకబడిన వర్గాల కమిషన్ ఎస్సీబిసీ, సుప్రీం కోర్టు పలు తీర్పుల్లో స్పష్టంగా పేర్కొన్నట్లు వారు వివరించారు.ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ప్రారంభ దశలో ఉండడంతో,



నామినేషన్లు స్వీకరించబడే ముందు ఇలాంటి వ్యక్తుల ధ్రువపత్రాలను పరిశీలించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఇది నిజమైన SC, BC వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన సామాజిక న్యాయం సూత్రాన్ని కాపాడే చర్య అవుతుందని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో బీసీ కారేంగుల శ్రీధర్, గడ్డం శ్రీనివాస్ లు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915